సాక్షి
నిజామాబాద్
శనివారం। 16। నవంబర్। 2024

● ఆధ్యాత్మికం

ఘనంగా కార్తీక పూజలు



శ్రీ నీలకంఠేశ్వరాలయంలో కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని దీపారాధన చేస్తున్న మహిళలు

నిజామాబాద్ రూరల్ / రెంజల్ : కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని జిల్లాలో మహిళలు తులసీ పూజలు, ఆలయాల్లో పెద్ద ఎత్తున దీపారాధన చేశారు. నగరంలోని శ్రీనీలకంఠేశ్వర ఆలయంలో బిల్వపత్ర అర్చనలు, అభిషేకాలతో పరమశివుని కొలిచారు. రెంజల్ మండలంలోని కందకుర్తి త్రివేణి సంగమ పుష్కరక్షేత్రం భక్తులతో పోటెత్తింది. పలు ప్రాంతాల భక్తులు నదీ స్నానాలకు తరలివచ్చారు. ఘాట్లపై పిండి దీపెంతలు తయారు చేసి వెలిగించారు.



కందకుర్తి త్రివేణి సంగమ ఘాట్లపై పిండి దీపాలు వెలిగిస్తున్న మహిళలు

● నయనానందకరం.. రథోత్సవం

● లింబాద్రి గుట్ట జాతరకు వేలాదిగా తరలివచ్చిన భక్త జనం



మోర్తాడ్: ప్రతియేట కార్తీక మాసంలో లింబాద్రి గుట్టపై నిర్వహించే శ్రీ లక్ష్మీ నరసింహుని రథోత్సవం శుక్రవారం కనుల పండువగా సాగింది. వేలాది మంది భక్తుల జయ జయ ధ్వానాల మధ్య ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు నంబి పార్థసారథి, నంబి విజయసారథి, వాసుదేవాచార్యులు, ఇతర వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య స్వామివారి రథ ప్రతిష్ఠ నిర్వహించారు. శ్రీమన్నారాయణుడిని ఆహ్వానించి పూజలు చేశారు. బలిపూజల అనంతరం రథోత్సవం ఘనంగా సాగింది. పుష్పాలంకరణ చేసిన రథంపై స్వామి వారిని ఊరేగించారు. తెల్లవారు జామున గర్భాలయంలో అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. గర్భాలయంలోని స్వామి వారి ఆయుధమైన శ్రీ చక్రాన్ని పల్లకిలో తెచ్చారు. హోమం, నైవేద్యం సమర్పణ, బలిహరణం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గోవింద నామస్మరణ మార్మోగుతుండగా మంగళ హారతులు, మేళతాళాలు, చప్పుళ్ల మధ్య రథోత్సవం సాగింది. శ్రీ లక్ష్మీ నరసింహుని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు.

న్యూస్‌రీల్

ఇందూరు తిరుమల క్షేత్రంలో ఔషధ సేవలు

మోపాల్: మోపాల్ మండలంలోని నర్సింగ్‌పల్లిలో గల ఇందూరు తిరుమలలో పౌర్ణమి సందర్భంగా గర్భిణులకు ఉచిత ఔషధ సేవ కార్యక్రమాన్ని శుక్రవారం రాత్రి నిర్వహించారు. అదే విధంగా ఏడాదిలో కేవలం కార్తిక పౌర్ణమి రోజు మాత్రమే ఇచ్చే ఆస్తమా నివారిణి, ఆస్తమా నిరోధిని అయిన దివ్య ఔషధాన్ని సాయంకాలం భక్తులకు ఉచితంగా ఇచ్చారు. అస్తమా రుగ్మత ఉన్నవారికి, అస్తమా భవిష్యత్తులో రాకుండా ఉండడానికి ముందు జాగ్రత్తగా ఈ ఔషధాన్ని ప్రసాదంగా ఆలయంలో అందించామని ఆలయ ధర్మకర్త నర్సింహారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో వేదపండితులు సంపత్ కుమారాచార్య, రోహిత్ కుమారాచార్య, గ్రామస్తులు నర్సారెడ్డి, నరాల సుధాకర్, రమేష్, మారుతి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

2.36 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ



అంబదాస్ రాజేశ్వర్, సివిల్ సప్లయ్ డీఎం

సుభాష్‌నగర్: జిల్లాలో 543 కొనుగోలు కేంద్రాల ద్వారా 2,36,588 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించినట్లు పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ అంబదాస్ రాజేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. 1,51,877 మెట్రిక్ టన్నులు సన్నరకాలు కాగా, 1,645 మెట్రిక్ టన్నులు కామన్, 83,066 మెట్రిక్ టన్నులు దొడ్డు రకాలు సేకరించామన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేపడుతున్నామని పేర్కొన్నారు. ముఖ్యంగా గన్నీ బ్యాగులు, లారీల కొరత లేకుండా, కడ్తా, తరుగు దోపిడీ జరగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కేంద్రాల వద్ద ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని అంబదాస్ రాజేశ్వర్ రైతులను కోరారు.

నగరంలో నేటి నుంచి రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ టోర్నీ



నిజామాబాద్ నాగారం: నిజామాబాద్ ఆఫీసర్స్ క్లబ్ ఆధ్వర్యంలో నగరంలోని క్లబ్ ప్రాంగణంలో రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ టోర్నమెంట్ శని, ఆదివారాల్లో నిర్వహిస్తున్నట్లు క్లబ్ కార్యదర్శి చిలివేరి సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం క్లబ్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఈ టోర్నీకి రాష్ట్రంలోని అన్ని జిల్లాల క్రీడాకారులు హాజరు అవుతారని పేర్కొన్నారు. క్రీడాకారుల్లో ప్రతిభను వెలికి తీయడానికి టోర్నీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్లబ్ సంయుక్త కార్యదర్శి వెంకట్ రాములు, గంగకిషన్, బి.డి దాస్, కిరణ్ కుమార్ గౌడ్, అంగిరేకుల సాయిలు, డాకం సాయిలు, డాక్టర్ రాములు, అరవింద్, రచ్చ మురళి, ఆశా నారాయణ, వీరేందర్ పర్మర్, శ్రీహరి పాల్గొన్నారు.


విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



నిజామాబాద్ అర్బన్: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా శుక్రవారం పాఠశాల విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. 'ప్రస్తుత టెక్నాలజీ – విద్యా విధానం' అంశంపై పోటీలు నిర్వహించారు. సుమారు 50 మంది విద్యార్థులు పాల్గొన్నారు. గ్రంథాలయ చైర్మన్ అంతరెడ్డి రాజిరెడ్డి, అధికారులు తారకం, బుగ్గారెడ్డి పాల్గొన్నారు.

గాడి తప్పిన పాలన

- సమీకృత కలెక్టరేట్‌లో జిల్లా బాస్ నజర్ కరువు.. ఆయా శాఖల్లో ఇష్టారాజ్యం
- ఉపాధ్యాయ నియామకాల్లో కొట్టొచ్చిన నిర్లక్ష్యం సాంకేతిక తప్పలంటూ చేతులు దులుపుకున్న విద్యాశాఖ
- జిల్లా పంచాయతీ కార్యాలయంలో జీపీల వద్దే వసూళ్లు
- కలెక్టరేట్‌లో పాలనాధికారి (ఏవో) ఇష్టారాజ్యం
- దేవాదాయ భూములు కాపాడడంలో అంతులేని జాడ్యం
- అడ్డూ అదుపూ లేని మొరం, ఇసుక అక్రమ తవ్వకాలు
- డీఫాల్ట్ మిల్లర్లపై చర్యలు శూన్యం
- విచ్చలవిడిగా సిజేరియన్లు.. పట్టించుకోని అధికారులు
- నగరపాలక సంస్థలో అక్రమాల పుట్ట
- పట్టింపులేని ఇన్‌చార్జి మంత్రి జూపల్లి



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై దాదాపు ఏడాది కాలం పూర్తి కావొచ్చింది. పాలన గాడిలో పడుతుందనుకుంటే పరిస్థితి పూర్తి భిన్నంగా మారింది. రోజురోజుకూ మరింత తీసికట్టుగా తయారవుతోంది. అక్రమాలు, లోపాలు, వైఫల్యాలపై సమీక్షలు చేయాల్సిన ఉన్నతాధికారులు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో అంతా ఇష్టారాజ్యం అయింది. మరోవైపు అక్రమాలకు, అవినీతికి కేరాఫ్‌గా మారిన కొందరు జిల్లా అధికారులను కొందరు కాంగ్రెస్ నాయకులు పెంచి పోషిస్తున్నారు. దీంతో సదరు అధికారులు తమదే రాజ్యమన్నట్లు ప్రవర్తిస్తున్నారు. జిల్లా బాస్ కలెక్టర్ ఆయా శాఖల్లో తనిఖీలు చేయకపోతుండడంతో కొన్ని శాఖల అధికారులు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. అత్యధిక కార్యాలయాలు ఉన్న సమీకృత కలెక్టరేట్‌లోనూ కలెక్టర్ తనిఖీలు లేక అంతా అస్తవ్యస్తమైనట్లు చర్చ నడుస్తోంది. మరోవైపు జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు జిల్లాలో కీలక శాఖల్లో పాలనా వైఫల్యాల విషయంలో ఏమాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.

■ ఇటీవల జిల్లాలో టీచర్ల రిక్రూట్‌మెంట్ల విషయంలో చోటుచేసుకున్న విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం చూస్తే ఎవరైనా ఆగ్రహం వ్యక్తం చేసే పరిస్థితి. అభ్యర్థుల జీవితాలతో ఆటలాడుకునే విధంగా వ్యవహరించారు. చివరకు సాంకేతిక తప్పిదం అంటూ చేతులు దులుపుకున్నారు. ప్రస్తుతం పరిస్థితి ఏవిధంగా తయారైందంటే ఉద్యోగం వచ్చినవారు సైతం తమ ఉద్యోగాలు ఉంటాయో.. ఊడుతాయోనని భయపడే స్థితి నెలకొంది. నియామక పత్రాలిచ్చి పాఠాలు చెప్పాక తప్పిదం జరిగిందని ఉద్యోగం లేదని చెబుతుండడంతో అభ్యర్థులు కన్నీటి పర్యంతమవుతున్నారు. ఈ తప్పిదాల కారణంగా జిల్లాలో 640 పోస్టులకుగాను కేవలం 452 పోస్టులు మాత్రమే భర్తీ కావడం గమనార్హం.

■ జిల్లా పంచాయతీ కార్యాలయంలో పాలనాధికారి అవినీతి పర్వం మరొకటి. బిల్లులు క్లెయిమ్ చేసుకునేందుకు, సెలవులు పెట్టుకునేందుకు వచ్చిన పంచాయతీ కార్యదర్శుల వద్ద వసూళ్లు చేస్తుండడం గమనార్హం. జిల్లా బాస్ పర్యవేక్షణ లేకపోవడంతో పంచాయతీల పాలన విషయంలో ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి.

■ సంక్షేమ వసతి గృహాల్లో ఎక్కడ చూసినా సమస్యలే కనిపిస్తున్నాయి. తాము అనేక ఇబ్బందులు పడుతున్నప్పటికీ కలెక్టర్ ఏమాత్రం దృష్టి పెట్టలేదని విద్యార్థులు వాపోతున్నారు.

■ జిల్లా వ్యవసాయ అధికారి ఇబ్బందులు పెడుతున్నాడంటూ గతంలో మండల వ్యవసాయ అధికారులు జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయంలో నిరసన వ్యక్తం చేశారు. మత్స్య శాఖ ద్వారా చేపపిల్లల పంపిణీ ఆలస్యం చేయడంతో సొసైటీలు ఇబ్బంది పడ్డాయి. మరోవైపు సహకార సంఘాలు భారీ నష్టాల్లోకి కూరుకుపోతున్నాయి. గత జిల్లా సహకార అధికారి సింహాచలం అక్రమాలపై ఆధారాలున్నప్పటికీ వీటిపై సమీక్ష కరువైంది.

■ రిజిస్ట్రేషన్ కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. అత్యధిక ప్రభుత్వ కార్యాలయాలు సమీకృత కలెక్టరేట్‌లోకి వెళ్లాయి. దీంతో రిజిస్ట్రేషన్ కార్యాలయాలను ఆయా ఖాళీ అయిన ప్రభుత్వ భవనాల్లోకి మార్చాలని డిమాండ్లు ఉన్నాయి. కలెక్టర్ పట్టించుకోవడం లేదు.

■ నిజామాబాద్ నగరపాలక సంస్థలో అవినీతి తవ్వినకొద్దీ ఉంటోంది. భవన నిర్మాణాల అనుమతుల నుంచి మ్యుటేషన్లు, టాక్స్ అసెస్‌మెంట్ విషయంలో భారీ అవినీతి చోటుచేసుకుంటోంది. సెల్లార్‌లు, ఫైర్, పార్కింగ్ అనుమతులు లేకున్నప్పటికీ కొందరు మున్సిపల్ అధికారులే బినామీలతో బిల్డర్లుగా వ్యవహరిస్తున్నారు. వీటిపై ఏమాత్రం తనిఖీలు లేవు.

ప్రయివేట్‌కు రిఫరల్ కేసులు

జిల్లాలో ప్రైవేటు ఆస్పత్రుల్లో సిజేరియన్లు విచ్చలవిడిగా చేస్తున్నారు. గతంలో ఈ విషయమై అప్పటి కలెక్టర్ నారాయణరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని నిరంతరం పర్యవేక్షించారు. దీంతో అప్పట్లో సిజేరియన్లు తగ్గాయి. అయితే ఇప్పుడు వీటి విషయమై కలెక్టర్ పట్టించుకోకపోతుండడంతో సిజేరియన్లు పెరుగుతున్నాయి. మరోవైపు జీజీహెచ్ నుంచి ప్రైవేటుకు రిఫరల్ కేసులు వెళుతున్నాయి. దీనిపైనా నిఘా కరువైంది.

■ కలెక్టరేట్‌లో సైతం పాలనాధికారి (ఏవో) ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండడంతో అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. దీంతో ప్రజా సమస్యల పరిష్కారం సంగతి అటుంచితే ప్రజలకు మరిన్ని కొత్త సమస్యలు వస్తున్నాయంటూ ఆరోపణలు వస్తున్నాయి. రెవెన్యూ, భూముల వ్యవహారాల్లో పాలనాధికారి తహసీల్దార్‌లను తీవ్రంగా వేధిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

■ దేవాదాయ శాఖ భూములను రక్షించే విషయంలోనూ అధికారులతో పాటు ఉన్నతాధికారులు ఏమాత్రం పట్టనట్లుగా వ్యవహరిస్తుండడంతో సదరు భూములు 90 శాతం అన్యాక్రాంతం అయ్యాయి. వీటి ఆక్రమణలు తొలగించలేని పరిస్థితికి తీసుకొస్తున్నారనే ఆరోపణలున్నాయి.

■ జిల్లాలో వందల సంఖ్యలో అక్రమ మొరం క్వారీలు నడుస్తున్నాయి. కేవలం మూడు క్వారీలకు మాత్రమే అనుమతులు ఉండడంతో అక్రమ తవ్వకాలకు అదుపు లేకుండా పోయింది. ఇక ఇసుక తవ్వకాల విషయానికి వస్తే అధికారులు, కొన్ని చోట్ల పోలీసు అధికారులు ఈ అక్రమ తోలకాల వ్యాపారం చేస్తుండడం విశేషం.

■ డిఫాల్ట్ మిల్లర్లపై ఇప్పటివరకు ఏమాత్రం చర్యలు తీసుకోలేదు. దీంతో మిల్లర్ల ఇష్టారాజ్యం అయిపోయింది. ఈ విషయమై ఏవిధమైన చర్యలు తీసుకున్నారని ఇటీవల జిల్లాకు వచ్చిన మంత్రి జూపల్లి కృష్ణారావు కలెక్టర్‌ను అడిగారు. దీనికి తగిన సమాధానం ఇవ్వలేదని తెలిసింది. వారం రోజుల్లో చర్యలు తీసుకోవాలని మంత్రి చెప్పినట్లు సమాచారం.

పేదలను కుటుంబ సభ్యులుగా భావించాలి

ఆర్మూర్: పేదలను తమ కుటుంబ సభ్యులుగా భావించి విధులు నిర్వహించాలని ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బందికి సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిని, ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణాన్ని గురువారం అర్ధరాత్రి ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అధికారులకు, పార్టీ కార్యకర్తలకు సైతం ఎలాంటి సమాచారం ఇవ్వకుండా తనిఖీలు నిర్వహించిన ఆయన ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులతో మాట్లాడి వైద్య సేవలు అందుతున్న తీరును తెలుసుకున్నారు. విధులకు హాజరైన సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. బస్టాండ్‌లో ప్రయాణికులతో మాట్లాడి సౌకర్యాలపై ఆరా తీశారు. ప్రయాణికులతో కలిసి చాయ్ తాగారు. ప్రయాణ ప్రాంగణంలో సౌకర్యాలు కల్పించాలని ఆర్టీసీ సిబ్బందికి సూచించారు.



బస్టాండ్‌లో ప్రయాణికులతో కలిసి చాయ్ తాగుతున్న ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి



ఆర్మూర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

సన్నాలపై చిన్న చూపు..!

- క్వింటాలుకు రూ. 300 తగ్గింపు
- ఎండిన ధాన్యానికీ ధర తక్కువే
- ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు

బాల్కొండ: సన్నరకం ధాన్యం పై వ్యాపారులు చిన్న చూపు చూస్తున్నారు. ఫలితంగా రైతులకు ధరాఘాతం తప్పడం లేదు. సన్న రకం పచ్చి ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు వ్యాపారులు ముందుకు రావడం లేదు. ఒకవేళ కొన్నా ధరను అమాంతం తగ్గిస్తున్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో కోతలు కోయక ముందే వ్యాపారులు పంట పొలాల వద్దకు వచ్చి వడ్లు కావలంటూ రైతు ల చుట్టూ తిరిగారు. ఇలా కోతలు కోయగానే అలా కాంటాలు చేశారు. క్వింటాలుకు పచ్చి ధాన్యాన్నే రూ. 2370 లకు కొనుగోలు చేశారు. ఇప్పుడు క్వింటాలుకు రూ. 2050 తగ్గించారు. సు మారు కింటాలుకు రూ. 300 తగ్గించారు. దీంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట పొలాల వద్దకు వచ్చి కొనుగోలు చేసిన వ్యాపారులు ప్రస్తుతం డి మాండ్ లేదంటూ ధర తగ్గించడం పై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కేవలం వ్యాపారులు సిండికేట్‌గా మారి ధాన్యం ధరను తగ్గించారని ఆరోపిస్తున్నారు.

ఆరబెట్టిన ధాన్యం..

సన్న రకం ఆర బెట్టిన ధాన్యానికి కూడా వ్యాపారులు ధరను తగ్గించారు. గతంలో క్వింటాలుకు రూ. 2500 పైగా పలికిన ధర ప్రస్తుతం రూ. 2300 లోపు పలుకుతోంది. ప్రభుత్వం ధాన్యం ధర తగ్గకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో కొర్రీలు పెట్టడం వలన రైతులు వెళ్లడం లేదు. కేంద్రాల్లో సకాలంలో కాంటాలు కావడం లేదంటున్నారు. ఏ గ్రేడు ధాన్యానికి రూ. 2,320, సాధారణ రకానికి క్వింటాలుకు రూ. 2300 మద్దతు ధర ప్రభుత్వం అందిస్తోంది. కొర్రీలను భరించలేక రైతులు క్వింటాలుకు రూ. 100 తక్కువకే వ్యాపారులకు అమ్ముకుంటున్నారు.



ముప్కాల్ మండలంలో ఆరబెట్టిన సన్న రకం ధాన్యం

వడ్ల ధరను తగ్గించారు..

సన్నరకం వడ్ల ధరను వ్యాపారులు తగ్గించారు. క్వింటాలుకు రూ. 2050 లకు కూడా కొనుగోలు చేయడం లేదు. పచ్చి వడ్లు అవసరం లేదంటున్నారు. ఆరబెట్టిన వాటికి కూడ ధర దక్కడం లేదు. కొనుగోలు కేంద్రాల్లో సకాలంలో కాంటాలు కావడం లేదు. – ప్రజ్వల్, రైతు, రెంజర్ల

రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు అద్దెభారం

- అర్బన్‌లో ప్రతినెలా రూ.40 వేలకుపైనే కిరాయి
- రెండంతస్తులపైకి మెట్లు ఎక్కలేక ప్రజల ఇక్కట్లు
- వివాదాలతో ఐడీవోసీలోకి రిజిస్ట్రేషన్ ఆఫీస్ మార్పు యోచన..?

సుభాష్‌నగర్: జిల్లాలో రిజిస్ట్రేషన్ కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. రూ.వేలల్లో ప్రతినెలా కిరాయి చెల్లిస్తుండటం ప్రభుత్వానికి భారంగా మారింది. ఈ భారాన్ని తగ్గించుకునే యోచనలో అధికారులు ప్రత్యామ్నాయమార్గాలు అన్వేషిస్తున్నారు. ఈనేపథ్యంలో నిజామాబాద్ అర్బన్ రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని శాశ్వత భవనంలోకి తరలించనున్నట్లు సమాచారం. దీంతో జిల్లా కేంద్రంలోని డాక్యుమెంట్ రైటర్లకు మరో షాక్ తగలనుంది. ఇప్పటికే దస్తావేజు లేఖర్లకు ఎలాంటి లైసెన్సులు లేవని, ప్రభుత్వ గుర్తింపు కూడా లేదని అధికారులు తేల్చేశారు. అద్దె భారంతో పాటు ఇతర ఖర్చులను తగ్గించుకునే చర్యలకు అధికారులు పూనుకున్నారు. రిజిస్ట్రేషన్ శాఖలో జరుగుతున్న వివాదాలపై కలెక్టర్ దృష్టి సారించారు. వరుస వివాదాలతో రిజిస్ట్రేషన్ కార్యాలయాల మార్పు అంశం కూడా తెరపైకి వస్తోంది.

భారం తగ్గించుకునే పనిలో..

జిల్లాలో నిజామాబాద్ అర్బన్, రూరల్, ఆర్మూర్, భీంగల్, బోధన్‌లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. అందులో నిజామాబాద్ అర్బన్, రూరల్, భీంగల్, బోధన్‌లో అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. భీంగల్‌లో కార్యాలయ నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ముఖ్యంగా నిజామాబాద్ అర్బన్, రూరల్ కార్యాలయాలు నగరం నడిబొడ్డున ఉండటంతో అద్దెలు భారీగా ఉన్నాయి. ఒక్క అర్బన్ కార్యాలయానికి రూ.40 వేలకుపైనే, రూరల్ కార్యాలయానికి రూ.20వేల వరకు ప్రతినెలా అద్దె చెల్లిస్తున్నట్లు తెలిసింది. మిగతా కార్యాలయాల తరలింపుపై కూడా అధికారులు దృష్టిసారించారు.



కలెక్టరేట్‌లోకి..

తెలంగాణలోని కొన్ని జిల్లాల్లో రిజిస్ట్రేషన్ కార్యాలయాలు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో నిర్వహిస్తున్నారు. అదే మాదిరిగా నిజామాబాద్‌లో కూడా ఈ శాఖను కలెక్టరేట్‌లోకి తరలించనున్నట్లు తెలుస్తోంది. గతంలోనే ఈ కార్యాలయాన్ని మారుస్తారని అధికారులు ప్రయత్నించి, విరమించుకున్నారు. ఐడీవోసీలోకి మార్చకపోవడానికి గల ఆంతర్యమేంటోనని అప్పట్లో పలు అనుమానాలు కూడా వ్యక్తం అయ్యాయి. తాజాగా రిజిస్ట్రేషన్ అధికారులు, డాక్యుమెంట్ రైటర్లకు మధ్య వివాదంతో మరోసారి కార్యాలయం మార్చే అంశం తెరపైకి వచ్చింది. కలెక్టరేట్‌కు రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని మారిస్తే ఇలాంటి వివాదాలకు తావుండదని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. డాక్యుమెంట్లు సైతం నిష్పక్షపాతంగా జరిగే అవకాశముంది. ఏమైనా అవకతవకలు జరిగితే వెంటనే కలెక్టర్ దృష్టికి బాధితులు తీసుకెళ్లే ఆస్కారం ఉంటుంది.

అర్బన్ రిజిస్ట్రేషన్ ఆఫీస్‌లో వసతుల లేమి..

నిజామాబాద్ అర్బన్ రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయం రెండో అంతస్తులో ఉంది. ప్రతి నిత్యం వందల సంఖ్యలో మహిళలు, వృద్ధులు రిజిస్ట్రేషన్ల నిమిత్తం వస్తూ పోతుంటారు. గతంలో 80 నుంచి 100 వరకు డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ అయ్యేవి. ప్రస్తుతం 50 నుంచి 60 వరకు సగటున డాక్యుమెంట్లు జరుగుతున్నాయి. ఒక్కో డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ కోసం ఆరుగురికి తక్కువ కాకుండా ప్రజలు వస్తుంటారు. అంతేగాకుండా రిజిస్ట్రేషన్ల కోసం వచ్చే ప్రజలకు తాగునీరు, మూత్రశాలలు, మరుగుదొడ్లు, కూర్చోవడానికి అనువైన స్థలం కూడా లేదు. గంటల తరబడి నిలబడటానికి వృద్ధులు, మహిళలు ఇబ్బందులు పడుతున్నారు.

క్లుప్తంగా

మాల సంఘం జిల్లా అధ్యక్షుడిగా రతన్‌కుమార్‌



కామారెడ్డి అర్బన్‌: మాల సంఘం జిల్లా కమిటీని శుక్రవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో సంఘం రాష్ట్ర నాయకుడు అయ్యాల సంతోష్‌ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా సంకి రతన్‌కుమార్‌, ప్రధాన కార్యదర్శిగా నీరెడ్డి మైసయ్య, కోశాధికారిగా మైండ్ల ప్రభాకర్‌, ఉపాధ్యక్షులుగా పి పెద్ద సాయిలు, వాగ్మరే లక్ష్మణ్‌, పసుల నరేశ్‌ ఎన్నికయ్యారు. అనంతరం జిల్లా కార్యవర్గానికి సంతోష్‌ నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శ్రీనివాస్‌, పాపయ్య, సాయిలు, రాజు, నరేశ్‌, మైసయ్య, కాశీరాం తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య కార్పొరేషన్‌ చైర్మన్‌కు అభినందనలు



బాన్సువాడ రూరల్‌: టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి, ఆర్యవైశ్య కార్పొరేషన్‌ చైర్మన్‌ కాల్వ సుజాత గుప్తాను శుక్రవారం బీర్కూర్‌కు చెందిన కాంగ్రెస్‌ పార్టీ రాష్ట్ర నాయకుడు అబ్దుల్‌ అహ్మద్‌ మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. కాంగ్రెస్‌ పార్టీ అధికారంలోకి రావడంలోనూ సుజాత కృషి ఉందన్నారు.

సిద్ధేశ్వర ఆలయ అభివృద్ధికి కృషి చేస్తాం



తాడ్వాయి: సిద్ధేశ్వరాలయాన్ని మరింత అభివృద్ధి చెందేలా తమవంతు కృషి చేస్తామని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌, శాస్త్రవేత్త పైడి ఎల్లారెడ్డి అన్నారు. తాడ్వాయి మండలంలోని బ్రహ్మాజీవాడిలో ఉన్న సిద్ధేశ్వరాలయంలో ఆలయ ఉత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలు పైడి ఎల్లారెడ్డి ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయి. ఆలయంలో వారు ఉదయం ప్రత్యేక పూజలు, హోమం చేశారు. ఆలయానికి రోడ్లు, తాగు నీటిసమస్య, పలు సమస్యలు పరిష్కారమయ్యేలా కృషి చేస్తామన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. అంతకు ముందు ఎమ్మెల్యే మదన్‌ మోహన్‌ తాడ్వాయిలో ఉన్న శబరిమాతాశ్రమాన్ని సందర్శించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



స్వామివారి దర్శనానికి బారులు తీరిన భక్తులు





రథోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి, కార్పొరేషన్‌ చైర్మన్‌లు మానాల మోహన్‌రెడ్డి, అనిల్‌

భక్తజన సంద్రంగా లింబాద్రి గుట్ట

- కనుల పండువగా సాగిన రథోత్సవం
- స్వామి వారిని దర్శించుకున్న పలువురు ప్రముఖులు
- ట్రాఫిక్‌ జామ్‌తో ఇబ్బందులు పడ్డ భక్తులు



రథోత్సవంలో పాల్గొన్న ఆర్మూర్‌ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి, బీజేపీ నాయకులు



రథోత్సవానికి ముందుగా బలిపూజ నిర్వహిస్తున్న వేద పండితులు

మోర్తాడ్‌: లింబాద్రి గుట్టపై శ్రీ లక్ష్మీ నర్సింహ స్వామి రథోత్సవం శుక్రవారం ఘనంగా సాగింది. వేలాది మంది భక్తులు హాజరయ్యారు. స్వామి వారిని దర్శించుకునేందుకు ఉదయం నుంచే భక్తులు బారులు తీరారు. పుష్కరిణి వీధుల నుంచి ప్రారంభమైన భక్తుల రద్దీ.. మెట్ల మార్గం నుంచి గర్భాలయ ముఖ ద్వారం వరకు కొనసాగింది. భక్తులు స్వామివారిని దర్శించుకోవడానికి గంటల తరబడి క్యూలైన్లలో నిలబడ్డారు. అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో దర్శనానికి ఎక్కువ సమయం పట్టింది. ఎమ్మెల్యేలు వేముల ప్రశాంత్‌ పైడి రాకేశ్‌రెడ్డి, మైనింగ్‌ కార్పొరేషన్‌ చైర్మన్‌ ఈరవత్రి అనిల్‌, రాష్ట్ర సహకార సంఘాల సమాఖ్య చైర్మన్‌, డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్‌ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పెద్దోళ్ల గంగారెడ్డి, భీమ్‌గల్‌ మున్సిపల్‌ చైర్మన్‌ ప్రేమలత తదితరులు స్వామి వారిని దర్శించుకున్నారు.

ట్రాఫిక్‌ జామ్‌పై ఇన్‌చార్జి సీపీ ఆరా!

రథోత్సవం సందర్భంగా భారీగా భక్తులు తరలి రావడంతో భారీగా ట్రాఫిక్‌ జామ్‌ అయింది. దీనిపై ఇన్‌చార్జి సీపీ సింధుశర్మ ఆరా తీసినట్లు తెలుస్తోంది. పోలీసుల వైఫల్యం, కావాలనే ట్రాఫిక్‌ జామ్‌ చేశారని ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి ఆరోపించిన నేపథ్యంలో సీపీ వివరాలు ఆరా తీయడం గమనార్హం. ఆర్టీసీ బస్సులతో పాటు ప్రైవేటు వాహనాలలో భక్తులు వివిధ ప్రాంతాల నుంచి శ్రీలక్ష్మీ నర్సింహ స్వామి దర్శనం కోసం భీమ్‌గల్‌కు చేరుకున్నారు. గతంలో పంట పొలాల్లో వాహనాలను నిలిపేవారు. కొంత కాలం నుంచి పంట పొలాల యజమానులు ప్రహరీ నిర్మించుకోవడం, కంచె ఏర్పాటు చేసుకోవడంతో వాహనాలను నిలుపడానికి సరైన స్థలం లేకుండా పోయింది. గుట్ట పరిసరాల్లో వాహనాలకు సరిపడే స్థలం లేకపోవడంతో రెండు, మూడు కిలోమీటర్ల వరకు వాహనాల శ్రేణి నిలిచిపోయింది. ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డితో పాటు ఇతర ప్రజాప్రతినిధులు సైతం గుట్టకు దూరంగానే తమ వాహనాలను నిలిపి కాలినడకనే స్వామివారి దర్శనానికి చేరుకున్నారు. అనేక మంది భక్తులు రథోత్సవానికి హాజరు కావాలనే ఉద్దేశంతో వాహనాలను రోడ్ల పక్కనే వదలిపెట్టి కాలినడకనే గుట్టకు చేరుకోవడం విశేషం. ఆర్మూర్‌ ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి, భీమ్‌గల సర్కిల్‌ ఇన్‌స్పెక్టర్‌ నవీన్‌కుమార్‌, ఎస్సై మహేశ్‌ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.



గుట్టకు వెళ్లే మార్గంలో నిలిచిన వాహనాలు

దైవ దర్శనం కాకుండా కుట్ర పన్నారు

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

మోర్తాడ్‌(బాల్కొండ): కార్తీక పౌర్ణమి రోజున తనకు లింబాద్రి గుట్ట లక్ష్మి నర్సింహస్వామి దర్శనం కాకుండా కుట్ర పన్నారని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం ఆయన లింబాద్రి గుట్ట వద్ద మాట్లాడారు. పదేళ్లుగా ఎమ్మెల్యే, మంత్రి హోదాలో ప్రతి జాతర, రథోత్సవం రోజున తాను గుట్టకు వచ్చి స్వామివారి దర్శనం చేసుకుంటున్నానని ఆయన చెప్పారు. శుక్రవారం ఉద్దేశ పూర్వకంగా ట్రాఫిక్‌ జామ్‌ అయ్యేలా చేసి తన కాన్వాయ్‌ను అడ్డుకున్నారని ఆరోపించారు. గతంలో ఎప్పుడూ ట్రాఫిక్‌ జామ్‌ కాలేదని ఈ రోజు రెండు కిలోమీటర్ల వరకు వాహనాలు ఆగిపోవడం చూస్తుంటే తాను సమయానికి చేరుకోకుండా కావాలని చేశారని ఆరోపించారు. ట్రాఫిక్‌లో తన వాహనాల శ్రేణి ఇరుక్కునిపోవడంతో రెండు కిలోమీటర్లు నడిచి గుట్టకు చేరుకున్నానని చెప్పారు. ఎవరి పైశాచిక ఆనందం కోసం పోలీసులు ఇలా వ్యవహరించారు అని ప్రశ్నించారు. ఈ అంశంపై ఆర్మూర్‌ ఏసీపీకి తన అసంతృప్తిని వెల్లడించినట్లు ప్రశాంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ అంశంపై సమగ్ర విచారణ జరిపించాలని సీపీ, కలెక్టర్‌, రాష్ట్ర డీజీపీలకు ఫిర్యాదు చేస్తానని తెలిపారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



జక్రాన్‌పల్లి: రాష్ట్రస్థాయి బేస్‌బాల్‌ పోటీలకు తొర్లికొండ జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. అండర్‌–17 బాలుర విభాగంలో జక్కుల శ్రీహరి, సంకెపల్లి శశికుమార్‌, బాలికల విభాగంలో గంగోత్రి, సరిత ఎంపికయ్యారు. ఈ నెల 16 నుంచి నిర్మల్‌ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని పీడీ గంగమోహన్‌ తెలిపారు. విద్యార్థులను ఎంఈవో శ్రీనివాస్‌ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సాయిలు, రామకృష్ణ, సునీత, కృష్ణ, మాలతి, గౌతమి, గంగాధర్‌, శేఖర్‌ తదితరులు పాల్గొన్నారు.

పట్టుబట్టారు.. కొలువు కొట్టారు

ఖలీల్‌వాడి: ఉద్యోగం సాధించాలనే తపన వారిని ముందుండి నడిపించింది. కృషి, పట్టుదల పోటీ పరీక్షలలో విజయం సాధించారు. ఒక ఉద్యోగం రాకున్న మనోస్థైర్యం వీడక ముందుకు నడిచారు. గురువారం వెలువడిన గ్రూప్‌–4 ఫలితాల్లో జిల్లాకు చెందిన పలువురు అభ్యర్థులు ఉద్యోగాలు సాధించారు.

కానిస్టేబుల్‌ రాకున్నా..



నగరంలోని కంఠేశ్వర్‌కు చెందిన గోపు దినేశ్‌ గ్రూప్‌ –4లో వార్డ్‌ ఆఫీసర్‌గా ఉద్యోగా సాధించాడు. దినేశ్‌ తల్లి ప్రమీల, తండ్రి మురళి(రిటైర్డ్‌ ఉద్యోగి). గతేడాది దినేశ్‌ కానిస్టేబుల్‌ కోసం సిద్ధమయ్యాడు. అయితే కాలుకు గాయం కావడంతో ఫిజికల్‌ టెస్ట్‌లో ఫెయిల్‌ అయ్యారు. తాజాగా గ్రూప్‌–4 కొలువు సాధించాడు.

తల్లి బీడీలు చేస్తూ..



నిజామాబాద్‌లోని గాజుల్‌పేట్‌కు చెందిన విజయ్‌ చిన్నతనంలోనే తండ్రి గంగాధర్‌ మృతిచెందాడు. తల్లి దేవి బీడీలు చేస్తూ విజయ్‌ను చదివించింది. మూడేళ్లుగా ప్రభుత్వ ఉద్యోగం కోసం ప్రిపేర్‌ అవుతున్న విజయ్‌ తాజాగా అకౌంటెంట్‌గా సెలెక్ట్‌ అయ్యాడు.

మూడేళ్లుగా కష్టపడితే..



నగరంలోని వినాయక్‌ నగర్‌కు చెందిన బీఎస్‌ చరణ్‌రాజ్‌ మూడేళ్లుగా గ్రూప్‌–2 పరీక్ష కోసం సన్నద్ధం అవుతున్నాడు. ఆయన తండ్రి కిరణ్‌రాజ్‌ గతంలో మృతి చెందగా తల్లి విజయలక్ష్మి కష్టపడి చదివించింది. గ్రూప్‌–4లో చరణ్‌రాజ్‌ వార్డ్‌ ఆఫీసర్‌గా సెలెక్ట్‌ కావడంతో కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

భర్త ప్రోత్సాహంతో..



నగరంలోని కోటగిరికి చెందిన అపర్ణ భర్త ప్రోత్సాహంతో గ్రూప్‌ –4 కొలువు సాధించింది. ఆమె భర్త హన్మాండ్లు వ్యాపారం చేస్తుండగా.. ఎంటెక్‌ పూర్తి చేసిన అపర్ణ రెండేళ్లు సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగం చేశారు. ప్రభుత్వ ఉద్యోగాల నోటిఫికేషన్‌ రావడంతో భర్త హన్మాండ్లు ప్రోత్సాహంతో కానిస్టేబుల్‌గా ఎంపికై ప్రస్తుతం హైదరాబాద్‌లో శిక్షణలో ఉంది. తాజాగా గ్రూప్‌–4 పరీక్షలో ఎడ్యుకేషన్‌ డిపార్ట్‌మెంట్‌లో జూనియర్‌ అసిస్టెంట్‌గా ఉద్యోగం వచ్చింది. అపర్ణకు ఒక బాబు ఉన్నారు.

భక్తి శ్రద్ధలతో గురునానక్‌ జయంతి



గాజులపేటలోని గురుద్వారాలో ప్రార్థనలు చేస్తున్న సిక్కులు



శోభాయాత్రలో పాల్గొన్న సిక్కులు



శోభాయాత్రలో అర్బన్‌ ఎమ్మెల్యే ధన్‌పాల్‌

నిజామాబాద్‌ రూరల్‌: నగరంలోని గాజుల్‌పేట్‌లో గల గురుద్వారాలో గురునానక్‌ జయంతిని శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచి గురుద్వారాలో సంకీర్తన, గురు గ్రంథ పఠనం కొనసాగింది. అనంతరం సిక్కులు ప్రత్యేక పూజలు చేశారు. ట్రాఫిక్‌ ఏసీపీ నారాయణ, నుడా చైర్మన్‌ కేశ వేణు, సిటీ కాంగ్రెస్‌ అధ్యక్షుడు నరేందర్‌సింగ్‌ గురుద్వార్‌లో పూజలు చేశారు. సిక్కులు నుడా చైర్మన్‌ను ఘనంగా సన్మానించారు. సాయంత్రం గురుద్వారా నుంచి పెద్ద బజార్‌, నెహ్రూ పార్క్‌ అహ్మదీబజార్‌ మీదుగా శోభాయాత్ర నిర్వహించారు. యువకుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. శోభాయాత్రలో అర్బన్‌ ఎమ్మెల్యే ధన్‌పాల్‌ సూర్యనారాయణ పాల్గొన్నారు.

క్రైం కార్నర్‌

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య

కామారెడ్డి క్రైం: మద్యానికి బానిసైన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన కామారెడ్డిలోని శ్రీరామ్‌నగర్‌ కాలనీలో శుక్రవారం జరిగింది. వివరాలు.. కాలనీకి చెందిన ఉల్లి నరేష్‌ (35) ఎల్లారెడ్డిలోని ఓ హోటల్లో వంట మాస్టర్‌గా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా మద్యానికి బానిస అయ్యాడు. తరచుగా భార్య పిల్లలను వేధిస్తూ ఉండేవాడు. శుక్రవారం ఉదయం కూడా మద్యం తాగి ఇంటికి వచ్చాడు. మధ్యాహ్నం ఇంట్లోని వంటగదిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మద్యం మత్తులో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతుడి భార్య లావణ్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌ రెడ్డి తెలిపారు.

ఇద్దరు కుమారులతో తల్లి అదృశ్యం

కామారెడ్డి క్రైం: కామారెడ్డి పట్టణంలోని ఎన్జీవోస్‌ కాలనీకి చెందిన ఓ తల్లి తన ఇద్దరు కుమారులతో సహా అదృశ్యమైనట్లు ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌ రెడ్డి శుక్రవారం తెలిపారు. కాలనీలో నివాసం ఉండే జొన్నల కల్యాణి తన ఇద్దరు కుమారులు విపుల్‌, సృజన్‌తో కలిసి గురువారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లింది. చాలా చోట్ల గాలించిన ఆచూకీ లభించలేదు. దీంతో ఆమె భర్త రవి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా కొద్దిరోజులుగా కల్యాణి కుటుంబంలో భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నట్లు తెలిసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు. వారి ఆచూకీ తెలిసిన వారు పట్టణ పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

వేర్వేరు ప్రమాదాల్లో పలువురి మృతి

ఉమ్మడి జిల్లాలో వేర్వేరు ప్రమాదాల్లో నలుగురు మృతి చెందారు. వ్యవసాయ బావిలో పడి రైతు, రైలులో నుంచి కింద పడి గుర్తు తెలియని మహిళ చనిపోయారు. మద్యం మత్తులో కింద పడి ఓ వ్యక్తి, వాగులో మునిగి మరొకరు మృత్యువాత పడ్డారు.



రవీందర్‌(ఫైల్‌)

రాజంపేట: బావిలో పడి ఒకరు మృతి చెందిన ఘటన రాజంపేట మండలం పెద్దాయిపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన కామిశెట్టి రవీందర్‌ వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం తన భార్య రాణి, గ్రామస్తుడు మైలారం చింటూలతో కలిసి బీర్నిస్‌ పంటకు పురుగుల మందు కొట్టడానికి ఉదయం 9 గంటలకు పంట పొలానికి వెళ్లాడు. కరెంట్‌ లేక పోవడంతో రవీందర్‌ పక్కనే ఉన్న రైతు బస్వన్న వ్యవసాయ బావి నుంచి నీరు తీసుకు రావడానికి వెళ్లాడు. అయితే బావి వద్దకు వెళ్లిన ఆయన తిరిగి రాలేదు. దీంతో రాణి భయపడి గ్రామస్తులకు సమాచారం ఇచ్చింది. వారు బావిలో గాలించగా రాత్రి పది గంటల ప్రాంతంతో మృతదేహం లభించింది. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై పుష్పరాజ్‌ తెలిపారు.

రైలులో నుంచి పడి మహిళ..

ఇందల్వాయి/ఖలీల్‌వాడి: ప్రమాదవశాత్తు రైలులో నుంచి పడి గుర్తు తెలియని మృతి చెందింది. ఈ ఘటన సిర్నాపల్లి–ఉప్పల్వాయి రైల్వేస్టేషన్‌ల మధ్య చోటు చేసుకున్నట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి శుక్రవారం తెలిపారు. నిజామాబాద్‌ స్టేషన్‌ మేనేజర్‌ నవీన్‌ ఇచ్చిన సమాచారం మేరకు ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించామని పేర్కొన్నారు. ఆమె వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని, వయసు 25 నుంచి 30 ఏళ్ల మధ్య ఉంటుందని తెలిపారు. మృతురాలి వివరాలు తెలిస్తే రైల్వే పోలీసుల(8712658591)ను సంప్రదించాలని కోరారు.

మద్యం మత్తులో కిందపడి..

మద్నూర్‌(జుక్కల్‌): మద్నూర్‌లోని లచమమ్మ ఆలయం వద్ద బోయరాజు(45) మద్యం మత్తులో కింద పడి మృతి చెందినట్లు శుక్రవారం ఎస్సై విజయ్‌ కొండ తెలిపారు. వివరాలు.. నారాయణఖేడ్‌కు చెందిన బోయరాజు బతుకుదెరువు కోసం గత కొన్నేళ్ల క్రితం మద్నూర్‌ వచ్చాడు. గురువారం స్థానిక శివాజీ చౌక్‌లోని లచమమ్మ ఆలయం వద్ద బోయరాజు మద్యం మత్తులో కిందపడి మృతి చెందాడు. మృతుడి భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై పేర్కొన్నారు. కాగా బోయరాజు కుటుంబం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉండడంతో పాటు స్థానికంగా వారికి తెలిసిన వారు లేకపోవడంతో పోలీసులే అంత్యక్రియలు చేశారు. మద్నూర్‌ ఎస్సై విజయ్‌ కొండ, పోలీసు సిబ్బంది సహాయం చేశారు. గ్రామ పంచాయతీ సహకారంతో మద్నూర్‌లో బోయరాజు అంత్యక్రియలు నిర్వహించి మానవత్వం చాటుకున్నారు. పోలీసులను గ్రామస్తులు అభినందించారు.

వాగులో మునిగి ఒకరు..



సురేశ్‌ (ఫైల్‌)

మద్నూర్‌(జుక్కల్‌): డోంగ్లీ మండలంలోని పెద్ద టాక్లీ గ్రామానికి చెందిన గాయక్‌వాడ్‌ సురేశ్‌(36) గ్రామ శివారులోని వాగులో పడి మృతి చెందినట్లు ఎస్సై విజయ్‌ కొండ తెలిపారు. వివరాలు.. సురేశ్‌ అత్తగారి ఊరు వాగుకు అటు పక్కనే ఉన్న మహారాష్ట్రలోని సాంగ్వి గ్రామం. గురువారం అత్తగారింటికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. వాగు దాటే క్రమంలో ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి భార్య లక్ష్మీబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు..



గంగాధర్‌ మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ఆర్మూర్‌టౌన్‌: ఆర్మూర్‌ మున్సిపల్‌ పరిధిలోని మామిడిపల్లి శివారులో యానం గుట్ట సమీపంలో శుక్రవారం సాయంత్రం ట్రాక్టర్‌ ఢీకొని సోలం గంగాధర్‌(35) మృతిచెందాడు. వివరాలు.. సోలం గంగాధర్‌ కొన్ని నెలలుగా బతుకు దెరువు కోసం జాక్రన్‌పల్లి మండలం కేశ్‌పల్లి గ్రామంలో ఉంటున్నాడు. ఆర్మూర్‌లో తన పని ముగించుకొని కేశ్‌పల్లి వెళ్తుండగా యానం గుట్ట ఎక్స్‌ రోడ్డు వద్ద ట్రాక్టర్‌ ఢీకొంది. గంగాధర్‌ అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మృతుడి భార్య సావిత్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై ఇంద్రకరణ్‌రెడ్డి తెలిపారు.

లారీ ఢీకొని ఒకరు..



గోపాల్‌(ఫైల్‌)

నిజామాబాద్‌ రూరల్‌/బాన్సువాడ రూరల్‌: రూరల్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని మల్లారం అటవీ ప్రాంతంలో ధాన్యం బస్తాల లారీ ఎదురుగా వస్తున్న వ్యాన్‌ను ఢీకొనడంతో గోపాల్‌(55) అనే వ్యక్తి మృతిచెందినట్లు రూరల్‌ ఎస్‌హెచ్‌వో మహ్మద్‌ఆరిఫ్‌ తెలిపారు. వివరాలు. బాన్సువాడ మండలం బోర్లం గ్రామానికి చెందిన అన్నం గోపాల్‌ శ్రీవాణి బీడీ కంపెనీ నిర్వహిస్తున్నాడు. ఆయన శుక్రవారం బీడీలను తీసుకొని వ్యాన్‌లో నిజామాబాద్‌ వైపు వస్తుండగా మల్లారం గండి వద్ద ధాన్యం లోడ్‌తో వెళ్తున్న లారీ ఢీకొంది. ప్రమాదంలో వ్యాన్‌లో ఉన్న గోపి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

రోడ్డు కిందకు దూసుకెళ్లిన బస్సు



నిజామాబాద్‌ రూరల్‌: ఆర్టీసీ బస్సు అదుపు తప్పి రోడ్డు కిందకు దూసుకుపోయిన ఘటన రూరల్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని బైపాస్‌ రోడ్డులో చోటు చేసుకుంది. రూరల్‌ ఎస్‌హెచ్‌వో మహ్మద్‌ ఆరీఫ్‌ తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్‌ డిపో–1కు చెందిన బస్సు శుక్రవారం ఉదయం 10 గంటలకు కోరట్‌పల్లి గ్రామానికి బయలు దేరింది. కంఠేశ్వర్‌ బైపాస్‌ రోడ్డులో బస్సు అదుపు తప్పి పొదల్లోకి దూసుకెళ్లింది. ఆ సమయంలో బస్సులో 30 మంది ప్రయాణికులు ఉండగా ఎవరికీ గాయాలు కాలేదు.

ఆవును చంపిన దుండగులు



లింగంపేట: లింగంపేట మండలం పొల్కంపేట గ్రామంలో గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఆవును గొడ్డలితో నరికి చంపారు. గ్రామానికి చెందిన చాకలి కాంతమయ్య తన ఆవును గ్రామ శివారులోని పశువుల కొట్టం వద్ద కట్టేశాడు. శుక్రవారం ఉదయం వెళ్లి చూడగా ఆవు రక్తం మడుగులో చనిపోయి ఉంది. గోవును హతమార్చిన విషయాన్ని పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ రవీందర్‌నాయక్‌, సీసీఎస్‌ సీఐ శ్రీనివాస్‌, స్థానిక ఏఎస్సై ప్రకాష్‌నాయక్‌ ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. కాంతమయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టినట్లు డీఎస్పీ తెలిపారు. ఆవును చంపిన వారిని పట్టుకుంటామన్నారు.

కుక్కల దాడిలో పలువురికి గాయాలు



ఎడపల్లి: ఎడపల్లి మండలంలోని ఏఆర్‌పీ క్యాంప్‌ గ్రామంలో వీధి కుక్కల దాడిలో పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. ఓ మహిళను కుక్కలు పెదవి కరవడంతో తీవ్రంగా రక్తస్రావం అయింది. గ్రామస్తులు ఆమెను వెంటనే ఆస్పత్రికి తరలించారు.

అసిస్టెంట్‌ లైన్‌మన్‌పై దాడి



బోధన్‌రూరల్‌: బోధన్‌ మండలంలోని ఊట్‌పల్లి గ్రామంలో ట్రాన్స్‌కో అసిస్టెంట్‌ లైన్‌మన్‌ (ఏఎల్‌ఎం) నవీన్‌ కుమార్‌పై ఇద్దరు మహిళలు దాడికి పాల్పడటంతో కేసు నమోదు చేసినట్లు బోధన్‌ రూరల్‌ ఎస్సై మచ్చేందర్‌ రెడ్డి తెలిపారు. విద్యుత్‌ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అసిస్టెంట్‌ లైన్‌మన్‌ నవీన్‌ కుమార్‌ శుక్రవారం ఊట్‌పల్లిలో మీటర్ల పరిశీలనకు వెళ్లాడు. ఈ క్రమంలో గ్రామంలో ఓ ఇంటికి అక్రమంగా విద్యుత్‌ను వినియోగిస్తుండటంతో గమనించి కన్షెక్షన్‌ తొలగిస్తుండగా ఆ ఇంటి ఓనర్‌ సాయమ్మ, ఆమె కొడలు సునీత కర్రతో దాడికు పాల్పడ్డాడు. దీంతో అతని ముఖానికి గాయమైంది. నవీన్‌ కుమార్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కరెంట్‌ షాక్‌తో గేదె మృతి



భిక్కనూరు: మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామంలో కరెంట్‌ షాక్‌తో శుక్రవారం పాడి గేదె మృతి చెందింది. గ్రామానికి చెందిన ముదాం మంజుల గేదె విద్యుత్‌ ట్రాన్స్‌ఫార్మర్‌ వద్ద మేస్తూ సపోర్టు వైరుకు తగిలింది. సపోర్టు వైరుకు విద్యుత్‌ సరఫరా కావడంతో షాక్‌ కొట్టి చనిపోయింది. మండల పశువైద్యాధికారి దేవేందర్‌ ఘటన స్థలాన్ని సందర్శించి పంచనామా నిర్వహించారు. గేదె విలువ రూ.90 వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపారు. ప్రమాద స్థలాన్ని ట్రాన్స్‌కో ఏఎల్‌ఎం రాథోడ్‌, మాజీ ఎంపీటీసీ కోడూరి సాయాగౌడ్‌లు సందర్శించారు.